క్లుప్తంగా

నేడు,రేపు దస్తావేజు లేఖరుల పెన్ డౌన్

కొవ్వూరు: రిజిస్ట్రేషన్ శాఖలో కొత్త నిబంధనలను అమలు చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా దస్తావేజు లేఖరులు ఈనెల 30, 31తేదీల్లో పెన్‌డౌన్ పాటిస్తున్నారని కొవ్వూరు దస్తావేజు లేఖరుల సంఘం కార్యదర్శి పాలేటి రవికిషోర్ మంగళవారం ప్రకటించారు. కొత్త నిబంధనల వల్ల రిజిస్ట్రేషన్ చేయించుకునే కక్షిదారులు కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ వ్యవస్థలో అమలు చేస్తున్న నూతన విధానాలను తమ సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు.

రైతులకు పంట రుణాల పంపిణీ



రుణాలు అందిస్తున్న సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు

నిడదవోలు రూరల్: రైతులకు ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోందని శంకరాపురం సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు అన్నారు. మండలంలోని శంకరాపురం సొసైట ఆధ్వర్యంలో 12 మంది రైతులకు రూ.15 లక్షల ఖరీఫ్ పంట రుణాలను మంగళవారం రామారావు అందజేశారు.కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి పి.ప్రకాశరావు, రైతులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొవ్వూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి రెండో దశ విద్యార్థుల నమోదు ప్రక్రియ సోమవారం ప్రారంభమైందని ప్రిన్సిపాల్ జె.సునీత పేర్కొన్నారు. సెప్టెబర్ ఒకటో తేదీ వరకూ ఈ నమోదు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఇప్పటి వరకూ నమోదు చేసుకోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఎక్కడ నమోదు చేసుకున్నప్పటికీ కళాశాల మారడానికి, కోర్సు మార్చుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. సెప్టెంబర్ 4 నుంచి 8వ తేదీ లోగా కళాశాలలో వెబ్ ఆప్షన్ చేయించుకోవాలన్నారు. తమ కళాశాలలో బీఎస్సీ మేథ్స్, ,బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ బోటనీ, బీకాం జనరల్, బీకాం కంప్యూటర్స్, బీఏ హిస్టరీ కోర్సులు ఉన్నాయన్నారు. వివరాల కోసం 96405 72625 అనే నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సీపీఎం సమరభేరి పోస్టర్ ఆవిష్కరణ

కొవ్వూరు: పెరిగిన ధరలు, నిరుద్యోగం, విద్యుత్తు భారాలను నిరసిస్తూ సీపీఎం బుధవారం సమరభేరి చేపట్టింది. సమరభేరి పోస్టర్‌ను మంగళవారం ఆ పార్టీ నాయకులు కొవ్వూరులో ఆవిష్కరించారు. పార్టీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు 30వ తేదీ నుంచి సెప్టెంబర్ నాలుగో తేదీ వరకూ ఆందోళనలు నిర్వహిస్తామని జిల్లా కమిటీ సభ్యుడు ఎం.సుందరబాబు తెలిపారు.30, 31 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా సంతకాల సేకరణ, 1న సచివాలయాల్లో వినతి పత్రాలు అందజేస్తామన్నారు.4న అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు.

చీపురుగూడెంలో కల్వర్టు నిర్మించాలి

నల్లజర్ల: ప్రస్తుతం విస్తరణ పనులు జరుగుతున్న నల్లజర్ల-కొయ్యలగూడెం మార్గంలో చీపురుగూడెం గ్రామంలో మురుగునీరు దిగువకు పోయేలా కల్వర్టు ఏర్పాటు చేయాలని ఆ గ్రామ పెద్దలు ఆర్ అండ్ బీ డీఈ వెంకటరమణను మంగళవారం కలిసి విన్నవించారు. గతంలో ఈ ప్రాంతంలో కల్వర్టు ఉండేదని కాలక్రమేణా రహదారి ఎత్తు పెరగడంతో కల్వర్టు కప్పబడి పోయిందని గ్రామపెద్దలు చెల్లు సుబ్రహ్మణ్యం, కంపన దుర్గారావు, చెల్లు సత్యనారాయణ, కూసంపూడి బుజ్జి వివరించారు. చీపురుగూడెం గ్రామ పరిధిలో సీసీ రోడ్డు వేయాలని కోరారు. దీనిపై డీఈ స్పందిస్తూ ఉన్నతాధికారులతో మాట్లాడి కల్వర్టు గాని లేదా తూరలు గాని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

గిన్నిస్ బుక్‌లో లెక్కల మాస్టారికి స్థానం



వేగేశ్వరపురంలో మహాజన్ కృష్ణప్రసాద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురం కేవీస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు డాక్టర్ మహాజన్ కృష్ణప్రసాద్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుకు ఎంపికయ్యారు. భారత దేశంలో వరకట్న విధానంపై రాసిన వ్యాసానికి గాను ఆయనకు ఈ గౌరవం దక్కింది. ఇటీవల చెన్నైలో నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణప్రసాద్ గిన్నిస్ బుక్ ప్రతినిధుల చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. గిన్నిస్ బుక్‌లో స్థానం లభించినందుకు గాను పాఠశాల ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు, ఆయనను అభినందించారు. మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో సీహెచ్ బాలామణి, సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశు రామారావు, మానవత సంస్థ సభ్యులు చంద్రయ్య, ఆంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమ్మ చేతి గోరుముద్ద

- ప్రభుత్వ స్కూళ్లలో రుచికరమైన మధ్యాహ్న భోజనం
- అదనంగా రాగిజావ
- ఇష్టంగా తింటున్న విద్యార్థులు



నిడదవోలు జెడ్పీ బాలికల హైస్కూల్లో భోజనాలు చేస్తున్న విద్యార్థినులు



పట్టణంలోని నంబర్- 3 మున్సిపల్ హైస్కూల్లో రాగి జావ తాగుతున్న విద్యార్థులు

నిడదవోలు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తోంది. పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకున్నపుడే విద్యార్థులు ఆరోగ్యంగా ఉండి చదువులోనూ రాణిస్తారు. ఆ ఉద్దేశంతోనే ప్రభుత్వం రోజుకో మెనూతో జగనన్న గోరుముద్ద పథకాన్ని అమలు చేస్తుంది. రుచికరమైన ఆహారంతో పాటు రాగిజావను కూడా అందిస్తోంది. దాంతో విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని ఇష్టంగా అరగిస్తున్నారు.

నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి

నిడదవోలు నియోజకవర్గంలో మొత్తం 158 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వాటిలో మొత్తం 14,084 మంది విద్యార్థుల చదువుతుండగా, సుమారు 1,400 మంది మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. గతంలో నాసిరకమైన వంటకాలతో అరకొరగా మధ్యాహ్నం భోజనం పథకం నడిచేది. ఆ భోజనాన్ని తినేందుకు విద్యార్థులు కూడా అంతగా ఆసక్తి చూపేవారు కాదు. ఇప్పుడు పరిస్థితులు మారాయి. విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా మెనూలో ప్రభుత్వం మార్పులు తీసుకొచ్చింది. ఎప్పటికప్పుడు విద్యార్థులు, విద్యా కమిటీల అభిప్రాయాలను విద్యా శాఖ సేకరిస్తోంది. కొన్ని ప్రాంతాల విద్యార్థులు సాంబారు అన్నాన్ని ఇష్టంగా తినకపోవడంతో మెనూలో నిమ్మకాయ పులిహోరను చేర్చారు. పాఠశాలల్లో రోజూ ఉపాధ్యాయుడు వెళ్లి పదార్థాలను పరిశీలించిన తర్వాతే విద్యార్థులకు భోజనాన్ని అందించడం విశేషం. గతంలో వంట ఏజెన్సీల నిర్వాహకులు నెలకు మూడు సార్లు కోడిగుడ్డు సరఫరా చేసేవారు. గుడ్లు కొన్నిచోట్ల చెడిపోయేవి. ఫలితంగా విద్యార్థులు తినేందుకు ఇబ్బంది పడేవారు. దానిని గమనించిన ప్రభుత్వం నెలకు నాలుగు సార్లు గుడ్లు సరఫరా చేయాలంటూ ఆదేశాలు జారీ చేసింది. ఏ వారంలో సరఫరా అయిన గుడ్డును అదే వారంలో వినియోగించేలా గుర్తులు వేస్తున్నారు. విద్యార్థులకు వారానికి ఐదు గుడ్లను ప్రభుత్వం అందిస్తోంది. ప్రభుత్వం ఇలా జాగ్రత్తలు తీసుకుంటున్న నేపథ్యంలో పాఠశాలల్లో భోజనం చేసే విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్లు చెబుతున్నారు.

మెనూ వివరాలిలా..

సోమవారం :	హాట్ పొంగల్, ఉడికించిన గుడ్డు, కూరగాయల పలావ్, గుడ్డు కూర, చిక్కీ
మంగళవారం :	పులిహోర, టమాట పచ్చడి, దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు, రాగి జావ
బుధవారం :	వెజిటబుల్ బిర్యాని, ఆలూ కుర్మా, ఉడికించిన గుడ్డు, చిక్కీ
గురువారం :	సాంబార్ బాత్, ఉడికించిన గుడ్డు
శుక్రవారం :	ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ
శనివారం :	ఆకుకూర, సాంబార్, తీపి పొంగల్, రాగిజావ

ఇష్టంగా తింటున్నారు



రోజూ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పర్యవేక్షించే బాధ్యతను ఒక టీచర్‌కు అప్పగిస్తున్నాం. ఆ టీచర్ దగ్గరుండి అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నారు. నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందిస్తున్నాం. గతంలో విద్యార్థులు ఇంటి నుంచి భోజనం బాక్సులు తీసుకు వచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.
– సీహెచ్ పద్మ, హెచ్‌ఎం, జెడ్పీ బాలికల హైస్కూల్, నిడదవోలు

భోజనం రుచిగా ఉంటోంది



నేను రోజూ పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం చేస్తున్నాను. వారంలో ఐదు రోజులు కోడి గుడ్డు ఇస్తారు. రోజుకో రకం వెరైటీ భోజనం పెడుతున్నారు. భోజనం చాలా రుచిగా ఉంటోంది. ఇంట్లో కన్నా మా పాఠశాలలోనే బాగుంటుంది.
– ఎస్‌కే ఫాతిమా, 10 తరగతి, జెడ్పీ బాలికల హైస్కూల్, నిడదవోలు

విద్యార్థులు అందరూ తింటున్నాం



గతంలో మధ్యాహ్న భోజనం సరిగ్గా తినేవాళ్లం కాదు. ఇప్పుడు చాలా రుచిగా ఉండడంతో రోజు పాఠశాలలోనే తింటున్నాం. ఇంట్లో భోజనం ఎలా ఉంటుందో స్కూల్లోనూ అలాగే ఉంటుంది. రోజుకో ఉపాధ్యాయుడు వెళ్లి భోజనం పరిశీలించి మాకు అందజేస్తారు.
– బి. చాందిని, ఏడో తరగతి, జెడ్పీ హైస్కూల్, నిడదవోలు

రాగి జావను ఇష్టంగా తాగుతున్నాం



భోజనంతో పాటు మాకు రాగిజావ కూడా ఇస్తున్నారు. గతంలో నేను మధ్యాహ్న భోజనం తినేదాన్ని కాదు. ఇప్పుడు ఇంటి నుండి ఏమీ తెచ్చుకోవడం లేదు. జగనన్న గోరుముద్ద భోజనాన్ని తింటున్నాను.
– కావేటి రోషిణీ సాయి, నంబర్– 3 మున్సిపల్ హైస్కూల్, నిడదవోలు

జగనన్న లేఅవుట్‌లో ఇల్లుంటే రూ. 10 లక్షల ఆస్తి

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- 95 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాల పంపిణీ



లబ్ధిదారులకు ఇంటి పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: జగనన్న ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ఇంటి నిర్మాణం పూర్తయితే రూ.10 లక్షల స్థిరాస్తి అక్క చెల్లెమ్మల వద్ద ఉన్నట్టే అని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. పట్టణంలోని 95 మంది పేదలకు ఎమ్మెల్యే ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. స్థానిక రోటరీ ఆడిటోరియంలో మంగళవారం మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ నిడదవోలు పట్టణాన్ని అనుకుని వైఎస్సార్ నగర్, ఎంపీ నగర్, తీరిగూడెం, లింగంపల్లి ప్రాంతాల్లో ఖరీదైన భూములను ఇళ్ల స్థలాల కోసం కొనుగోలు చేశామన్నారు. ఇప్పటికే పట్టణంలో 2,500 మంది పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేశామని చెప్పారు. వాటిలో ఇప్పటి వరకూ 50 శాతం లబ్ధిదారులు గృహ నిర్మాణాలను పూర్తి చేశారన్నారు. జగనన్న లే అవుట్లలో విద్యుత్తు, సీసీ రోడ్లు, మంచినీటి పైపులైన్, డ్రైనేజీ వంటి మౌలిక వసతులు కల్పిస్తున్నట్టు చెప్పారు. పట్టాలు అందుకున్న లబ్ధిదారులు త్వరలో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసి గృహ ప్రవేశాలకు తనను పిలవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, కమిషనర్ కేవీ పద్మావతి, వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు మద్దిపాటి ఫణీంద్ర, ఎస్‌కే చాన్ బాషా, ఎస్‌కే వజీరుద్దీన్, హౌసింగ్ డీఈ శేఖర్, కౌన్సిలర్లు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా అందరికీ లబ్ధి

చాగల్లులో మంత్రి వనిత, నిడదవోలులో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు గడప గడపకూ..



చాగల్లులో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి తానేటి వనిత



నిడదవోలులో మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

చాగల్లు: అర్హతే ప్రామాణికంగా రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. 129వ రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకూ ఆమె చాగల్లులో నిర్వహించారు. ఆమె సచివాలయం-1 పరిధిలోని 16, 17, 18 వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, అక్కాచెల్లెమ్మలు, యువత, చిన్నారులతో మాట్లాడారు. హోం మంత్రికి వారు అడుగడుగునా హారతులు పడుతూ, పుష్పగుచ్ఛాలిస్తూ బ్రహ్మరథం పట్టారు. పర్యటన మధ్యలో మండల పరిషత్ స్కూల్ విద్యార్థులతో మంత్రి కాసేపు ముచ్చటించారు. జగనన్న గోరుముద్ద ద్వారా విద్యార్థులకు అందిస్తున్న వంటకాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా హోం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సీఎం రూపొందించారన్నారు. ఏమైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు తన దృష్టికి తీసుకు వచ్చిన చిన్న చిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్యూరి దొరయ్య, వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, చెల్లింకుల శ్రీవిజయ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగ్రోతు సురేంద్రకుమార్, మండలశాఖ గౌరవాధ్యక్ష, అధ్యక్షులు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, చాగల్లు సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, ముళ్లపూడి ఉదయ్‌భాస్కర్, ఎంపీటీసీలు ఇంటి బాలా వెంకట కృష్ణవేణి, ఎస్.అర్జునుడు, ఎస్‌కె పాషా తదితరులు పాల్గొన్నారు.

జీవన ప్రమాణాలు మెరుగుపరిచే లక్ష్యంతో..

నిడదవోలు: మున్సిపాలిటీ పరిధిలోని 26, 27,28 వార్డులలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లు, పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి జగనన్న పథకాల ద్వారా ఏయే కుటుంబానికి ఎంతెంత లబ్ధి చేకూరిందో వివరించారు. ప్రజలు తనకు నివేదించిన పలు సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వానికి ప్రస్తుత ప్రభుత్వానికి వ్యత్యాసాన్ని గమనించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వార్డు ఇన్‌చార్జి పాలామణి కిరణ్, కమిషనర్ కేవీ పద్మావతి, కౌన్సిలర్లు కామిశెట్టి వెంకట సత్యనారాయణ, కొత్తపల్లి సుప్రియ, ఎండి షకీరాబేగం, ఆకుల ముకుందరావు, అహ్మదున్నీసా బేగం, గోపిరెడ్డి శ్రీనివాస్, తోలేటి ఝాన్సీ, మానుపాటి లక్ష్మి, ముండంటి మాణిక్యమాల తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష, సంస్కృతి రక్షణ మన బాధ్యత

- కొవ్వూరు ఆర్డీవో మల్లిబాబు
- విద్యాలయాల్లో తెలుగు భాషా దినోత్సవం
- గిడుగు రామ్మూర్తి పంతులుకు నివాళి



కొవ్వూరులో ఆర్డీవో మల్లిబాబును సత్కరిస్తున్న ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాల సిబ్బంది

కొవ్వూరు: తెలుగు భాషను, తెలుగువారి సంస్కృతిని కాపాడు కోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందని ఆర్డీవో ఎస్.మల్లిబాబు అన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని మంగళవారం పట్టణంలోని ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాలలో నిర్వహించారు. తెలుగు భాష వికాసానికి ఎనలేని సేవ చేసిన గిడుగు రామ్మూర్తి పంతులు 160వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి ఆర్డీవో పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ తెలుగు వాడుక భాష ఉద్యమానికి గిడుగు ఆద్యుడన్నారు. గ్రాంధిక భాషలో ఉన్న పాఠ్యాంశాలను తెలుగు వ్యవహారిక భాషలోకి మార్చడానికి గిడుగురామ్మూర్తి చేపట్టిన ఉద్యమం కారణంగానే విద్య సరళీకృతం అయ్యిందన్నారు. ఆయన జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకోవడం హర్షణీయం అన్నారు. శతావధాని తాతా సందీప్‌శర్మ మాట్లాడుతూ తెలుగు భాష అంటే మాతృభాష అని, మన జాతి గౌరవం అని ప్రతి పౌరుడు గుర్తించాలన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మల్లిబాబును, తాతా సందీప్‌శర్మను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎన్వీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.గిడుగు రామ్మూర్తి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రిన్సిపాల్ జె.సునీత, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.తెలుగు ప్రముఖుడు ఆర్‌వీకే శర్మ, స్టాఫ్ క్లబ్ ప్రెసిడెంట్ నాగ సూర్యనారాయణలతో పాటు పలువురిని సత్కరించారు.

నల్లజర్ల: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా నల్లజర్ల భాష్యం స్కూల్లో తెలుగు అధ్యాపకులను విద్యార్థులు సత్కరించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం వంటి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసారు.

చాగల్లు: చాగల్లు జెడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం పి.వీర్రాజు ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. అలాగే చాగల్లు, నందిగంపాడు, మార్కొండపాడు గ్రామాల్లోని ప్రైవేట్ విద్యాలయాల్లోనూ మాతృ భాషా దినోత్సవాన్ని జరిపారు.

పశుపోషకులకు వరం పాలవెల్లువ

- వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం విజయనిర్మలకుమారి
- మూడు గ్రామాల మహిళా రైతులకు అవగాహన



మహిళా పాడి రైతులతో మాట్లాడుతున్న వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం విజయనిర్మలకుమారి

నల్లజర్ల: జగనన్న పాలవెల్లువ పథకం పశు పోషకులకు వరం వంటిదని వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం విజయ నిర్మలకుమారి అన్నారు. సహకార సంఘాల ద్వారా అమూల్ పాల ఉత్పత్తిదారులకు మేలుజాతి గేదెల కొనుగోలుకు హామీ లేకుండా రుణ సహాయం అందిస్తామన్నారు. ఆమె మంగళవారం మండలంలోని దూబచర్ల, కొత్తగూడెం,అయ్యవరం గ్రామాల్లో మహిళా పాడి రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విజయ నిర్మలకుమారి మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం గ్రామగ్రామానా అమూల్ డెయిరీలు ఏర్పాటు చేస్తోందన్నారు. సహకార సంఘాల ద్వారా తక్కువ వడ్డీకి రూ.లక్ష నుంచి రూ.1.60 లక్షల వరకూ రుణాలు అందిస్తామన్నారు. ఈ రుణాలను తిరిగి 18 వాయిదాలలో చెల్లించవచ్చన్నారు. రైతులు ఉత్పత్తి చేసిన పాలను గిట్టుబాటు ధరకు అమూల్ డెయిరీల ద్వారా కొనుగోలు చేసే ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. పశుసంవర్ధక శాఖ ఏడీఏ జాన్ మోజెస్ వెస్లీ మాట్లాడుతూ అధిక వెన్న శాతం ఉండే పాలకు మంచి ధర లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రత్నం, సీసీలు మాలిని, జ్యోతి పాల్గొన్నారు.

తెలుగు భాషాభిమానికి సత్కారం



రాజమహేంద్రవరంలో వేణుగోపాల్‌ను సత్కరిస్తున్న డీఆర్వో నరసింహులు

పెరవలి: తెలుగు భాషపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నందుకు, పాలనా వ్యవహారాల్లో తెలుగు భాషను వినియోగిస్తున్నందుకు అరిగెల వేణుగోపాల్ ఉత్తమ ఉద్యోగిగా ఎన్నికయ్యారు. వేణుగోపాల్ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. మంగళవారం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరంలోని కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు చేతుల మీదుగా వేణుగోపాల్ సత్కారం పొందారు. సత్కారం పొందిన వేణుగోపాల్‌ను ఎంపీడీఓ దామోదరరావు, తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి, వివిధ శాఖల ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

శాంతి నెలకొల్పాలంటూ ర్యాలీ

నిడదవోలు రూరల్: మణిపూర్ రాష్ట్రంలో శాంతిని నెలకొల్పాలని కోరుతూ మండలంలోని కోరుమామిడి గ్రామంలో మంగళవారం క్రైస్తవ సంఘాల సభ్యులు శాంతి ర్యాలీ, మానవహారం నిర్వహించారు. మణిపూర్‌లో యువతులను నగ్నంగా ఊరేగించడం, అత్యాచారాలు, హత్యలకు పాల్పడడం దురదృష్టకరమంటూ వారు నినాదాలు చేశారు. ఈ ఘటనలకు కారణమైన, ప్రేరేపిస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి సత్యవరప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. స్థానిక పాస్టర్లు డి.ప్రేమ్‌కుమార్, యు.విల్సన్, ఎస్.పేతురు, ఆర్.సుబ్బారెడ్డి, అబ్రహాం, జె.పాలు, స్టీఫెన్, జీవన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పిల్లలకు జాగ్రత్తగా వైద్యం చేయాలి

కొవ్వూరు: పిల్లలకు వైద్యం చేసేటపుడు తగిన జాగ్రత్తలు పాటించాలని పిల్లల వైద్య నిపుణుడు కేవీడీ ప్రసాద్ సూచించారు. బేసిక్ మెడికల్ ప్రాక్టీషనర్స్ (బీఎంపీ)అసోసియేషన్ కొవ్వూరు ప్రాంతీయ మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం పట్టణంలోని లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో నిర్వహించారు. సమావేశానికి రాజమహేంద్రవరంలోని రాజా ఆసుపత్రి వైద్యుడు ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పిల్లల్లో వచ్చే వివిధ రకాల వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి బీఎంపీలకు ఆయన వివరించారు. బీఎంపీ సంఘాధ్యక్షుడు పీవీ శ్రీనివాసవర్మ, ప్రధాన కార్యదర్శి మనోహర్, రామాంజనేయులు, సత్తిరాజు, వైవీఎస్ రమణ తదితరులు పాల్గొన్నారు.

గృహ సారథులకు బీమా

నిడదవోలు: ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడి ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని బస్టాండ్ రోడ్ సచివాలయంలో గృహ సారథులకు బీమా నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.

కలెక్టరేట్‌కు రావాలని కరస్పాండెంట్‌కు ఆదేశం

నల్లజర్ల: పోతవరం వివేకానంద ఎయిడెడ్ స్కూల్ కరస్పాండెంట్ టీఎస్ఎన్ లక్ష్మిని గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు రాజమహేంద్రవరంలోని కలెక్టరేట్‌కు హాజరు కావాలని కలెక్టర్ మాధవీలత ఆదేశించారు. ఈ మేరకు ఎంఈఓ వై.సత్యనారాయణ మంగళవారం ఆమె నివశిస్తున్న ఆచంటకు వెళ్లి నోటీసు అందజేశారు. గతంలో వివేకానంద ఎయిడెడ్ స్కూల్లో సుగుణకుమారి ఎస్‌జీటీగా పనిచేశారు. ప్రభుత్వం ఆ ఎయిడెడ్ స్కూల్‌ను రద్దు చేయడంతో ఆమె ప్రస్తుతం అచ్చన్నపాలెంలో ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తోంది. సుగుణకుమారి సర్వీసు రిజిస్టరును ఆ ఎయిడెడ్ స్కూల్ యాజమాన్యం ఇంత వరకూ ఎంఈఓకు అప్పగించలేదు. దాంతో 15 నెలలుగా ప్రభుత్వం నుంచి ఆమెకు జీతం రావడం లేదు. దీనిపై సుగుణకుమారి ఉద్యోగుల స్పందనలో చేసిన ఫిర్యాదుపై కలెక్టరేట్‌కు హాజరు కావాలని లక్ష్మిని కలెక్టరు ఆదేశించారు.

నాయీ బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

కొవ్వూరు: నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీ ఎన్నిక మంగళవారం స్థానిక సత్యవతి నగర్‌లోని కమ్యూనిటీ హాల్లో నిర్వహించారు. సంఘ పట్టణ శాఖ గౌరవాధ్యక్షుడిగా పట్నాల శ్రీనివాస్, అధ్యక్షుడిగా చింతలపూడి ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా కోడూరి కృష్ణ, కార్యదర్శిగా మేడూరు వెంకట్రావు, కోశాధికారులుగా మల్లవరపు మోహన్, పొన్నాడ సూరిబాబు, తాటిపూడి ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా డమర్ సింగ్ త్రినాథ్‌లు ఎన్నికయ్యారు. రాష్ట్ర సంఘం కార్యదర్శి మేడూరు వీర్రాజు, గౌరవ సలహాదారుడు బొందపల్లి నరసింహమూర్తి ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర చరిత్రలో నాయీబ్రాహ్మణులను టీటీడీ ట్రస్టు బోర్డు మెంబర్‌గా నియమించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వీర్రాజు పేర్కొన్నారు.

జాబితా నుంచి 1,067 ఓట్ల తొలగింపు

గోపాలపురం: ఓటర్ల జాబితాలో అవకతవకలకు అవకాశం లేకుండా సవరణలు చేపట్టినట్టు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి టీఈఎం రాజు అన్నారు. ఓటర్ల సవరణలకు సహకరించాలని కోరుతూ మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ 2022- 23 కాల వ్యవధిలో 1067 ఓట్లను జాబితా నుంచి తొలగించామన్నారు. తొలగించిన ఓటర్లపై రాజకీయ పార్టీలకు ఎటువంటి సమాచారం ఉన్నా తెలియజేయాలని సూచించారు.

గర్భిణులకు పౌష్టికాహారం

నిడదవోలు: రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు సెంట్రల్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు బొల్లా శ్రీనివాస్ గౌడ్, బొల్లా లక్ష్మీవరప్రసాద్, నీరుకొండ సుబ్రహ్మణ్యం, ముళ్ళపూడి వెంకట్రావు, మాచర్ల మధుసూదనరావు, చైన్లు రాజా, కొత్తపల్లి మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

[illegible]

బ్రాంచ్ మేనేజర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, దేవరపల్లి